



సీఎం రేవంత్‌రెడ్డికి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న చైర్‌పర్సన్లు అనితారెడ్డి, సునీతారెడ్డి

సీఎంను కలిసిన జడ్పీ చైర్‌పర్సన్లు

రంగారెడ్డి అర్బన్, జూన్ 23 : రంగారెడ్డి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్లు తీగల అనితాహరినాథ్‌రెడ్డి, పట్నం సునీతామహేందర్‌రెడ్డిలు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. బొకే అందజేశారు. స్థానిక సంస్థలకు నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా చైర్‌పర్సన్లు సీఎంను కోరారు. రూ2లక్షల రైతు రుణమాఫీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై వారు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.



చేవెళ్లలో అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- నూతన బిల్డింగ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు
- రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలపై ప్రభుత్వం స్పెషల్ ఫోకస్
- అధిక ఆదాయాన్నిచ్చే చోట్ల తొలి విడతలోనే నిర్మాణాలు
- కార్పొరేట్ తరహాలో ఆఫీసులు.. సొంత భవనాల ఆధునీకరణ
- చాలాచోట్ల అరకొర వసతులతో అద్దె భవనాల్లో కార్యాలయాలు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు.. మహర్దశ

త్వరలోనే ఆఫీసులకు సొంత భవనాలు

ఉమ్మడి జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు మోక్షం కలగనుంది. జిల్లాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అధునాతన హంగులతో నూతన భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పనుల కోసం ఆఫీసులకొచ్చే వారికి కేఫ్‌టేరియాలు, వెయిటింగ్ లాంజ్‌లు తదితర వసతులతో కార్పొరేట్ ఆఫీసుల తరహాలో ఈ బిల్డింగ్‌లను నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. సర్కారుకు భారీగా ఆదాయం తెచ్చే రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాలను తొలి విడతలో నిర్మించనున్నారు. ఎక్కువ ఆదాయం వచ్చే జిల్లాలకు తక్కువ ఆదాయం వచ్చే జిల్లాల నుంచి సిబ్బందిని సర్దుబాటు చేయనున్నారు. రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయాలకు వెళ్లే ప్రజలకు ఇబ్బందులు తొలగనున్నాయి.



అద్దె భవనంలో కొనసాగుతున్న వికారాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

(ఆంధ్రజ్యోతి-రంగారెడ్డి అర్బన్, జూన్ 23): ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూర్చిపెట్టడంలో రిజిస్ట్రేషన్ శాఖ ముందు వరుసలో ఉంటుంది. కానీ.. అలాంటి శాఖకు ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో సొంత భవనాల్లేవు. అయితే త్వరలో ఆ శాఖ కార్యాలయాలకు మంచి రోజులు రానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలనీ, అదుకోసం స్థలాలు సేకరించాలని, ఇప్పటికే సొంత భవనాలుంటే వాటినీ కార్పొరేట్ స్థాయిలో ఆధునికీకరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అద్దె భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయాల స్థానంలో కార్పొరేట్ కార్యాలయాలను తలదన్నే రీతిలో అధునాతన భవనాలను నిర్మించనున్నారు. రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులున్నాయి. వీటిలో 38 మాత్రమే సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ పరిధిలో 22 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వాటిల్లో జిల్లా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం కూడా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. డిస్ట్రిక్ట్ సబ్ రిజిస్ట్రార్ పరిధి 22 కార్యాలయాల్లో రంగారెడ్డి జిల్లాలో 18, వికారాబాద్ జిల్లాలో నాలుగు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వికారాబాద్ జిల్లా కొడంగల్ సబ్ రిజిస్ట్రార్ మినహా మిగతా అన్ని చోట్లా కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతోన్నాయి. ప్రస్తుతం రిజిస్ట్రేషన్లకు వచ్చే వారు కూర్చునేందుకు వీలు లేకుండా ఉండటంతో చెట్ల కింద, నీడ ఉన్న చోట సర్దుకుపోతున్నారు. ఈ కార్యాలయాలు కూడా సీజన్లలో కిక్కిరిస్తున్నాయి. కనీసం అక్కడ కూర్చునే పరిస్థితి కూడా లేదు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు గంటల తరబడి కార్యాలయంలో నిలబడే ఉండాల్సి వస్తోంది. ఇకపై ఇలాంటి పరిస్థితి లేకుండా ఉండేందుకు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు నూతన భవనాలను నిర్మించేందుకు తెలంగాణ సర్కార్ సంకల్పించింది. భూములు సిద్ధంగా ఉన్నచోట వీలైనంత త్వరగా మోడల్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులను నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులకు సరిపడే స్థలాలను అన్వేషిస్తున్నారు. మొదటి దశలో ఆదాయం ఎక్కువగా వస్తున్న రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు.



షాద్‌నగర్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మించేందుకు కేటాయించిన స్థలం

జిల్లాలపై స్పెషల్ ఫోకస్!

రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాపై సర్కార్ స్పెషల్ ఫోకస్ పెట్టింది. నగరానికి ఆనుకొని ఉండటం, ఎక్కువగా రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు జరగడం, ఎప్పటికప్పుడు పెద్ద పెద్ద వెంచర్లు ఏర్పాటు అవుతుండటంతో సర్కార్ ఈ రెండు జిల్లాలపై ప్రత్యేక నజర్ పెట్టింది. రంగారెడ్డి జిల్లాలోని 18, మేడ్చల్ జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునిక హంగులతో నిర్మించేందుకు ప్లాన్ చేసింది. స్థల పరిశీలన చేయాలని ఇప్పటికే సంబంధిత అధికారులకు సైతం ఆదేశాలు అందాయి. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంలో జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ముందంజలో ఉన్నాయి.

అరకొర వసతులతో ఏళ్లుగా అద్దె భవనాల్లో...

నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాల్లేవు. అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. నిత్యం లక్షల్లో ఆదాయం వస్తున్నా కార్యాలయాలకు వచ్చే ప్రజలకు కనీస వసతులు లేక తిప్పలు పడుతున్నారు. కలెక్టరేట్, ఔటర్ రింగ్‌రోడ్డు, ఫార్మాసిటీ, వంటి ఎన్నో పరిశ్రమలు ఏర్పాటు అవుతుండటంతో ఇక్కడ భూములకు భారీగా డిమాండ్ ఉంది. దీంతో స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు భారీగా జరుగుతున్నాయి. అద్దె భవనంలో సరైన తాగునీటి వసతి, మూత్రశాలలు లేక కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ సౌకర్యం లేక రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు.

నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినా..

చేవెళ్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మించేందుకు కోర్టు పక్కనున్న స్థలాన్ని కేటాయించారు. పదేళ్ల క్రితం రూ.62లక్షలు మంజూరు చేశారు. భవనం నిర్మించేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో నిధులు మళ్లిపోయాయి. కార్యాలయం ప్రస్తుతం అయ్యప్ప స్వామి ఆలయం పక్కన అద్దె భవనంలో కొనసాగుతోంది. కనీస సౌకర్యాలు లేవు. క్రయ విక్రయాలు జరిపేందుకు వచ్చిన వారికి తాగునీరు, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలు లేవు. ప్రజలు ఇబ్బందుల ఎదుర్కొంటున్నారు. షాద్‌నగర్‌లోని నాగులపల్లి రోడ్డులో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి 2019లో ప్రభుత్వం 10గుంటల భూమిని కేటాయించింది. దీనికి అప్పటి హోం మంత్రి మహమూద్ అలీ శంకుస్థాపన చేశారు. కానీ నేటి వరకు ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్ట లేదు. ప్రస్తుతం ఈ స్థలం సమీపంలో ఉన్న ఫంక్షన్ హాల్‌కు పార్కింగ్ స్థలంగా మారింది. రాజేంద్రనగర్‌కు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం 1996లో మంజూరైంది. తాత్కాలికంగా అంటూ అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. నేటికీ అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. శేరిలింగంపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి స్థలాన్ని కేటాయించారు. అయితే ఈ స్థలం వివాదంలో ఉంది. ఓ ప్రజాప్రతిధి అడ్డుకోవడంతో భవ నిర్మాణానికి నోచుకోవడం లేదు. అలాగే శంకర్‌పల్లి, గండిపేట్, ఫరూక్‌నగర్, చంపాపేట్, పెద్ద అంబర్‌పేట్, వనస్థలిపురం, సరూర్‌నగర్, శంషాబాద్, అబ్దుల్లాపూర్‌మెట్, వికారాబాద్, పరిగి, తాండూరుల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో ప్రజలు, అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇదీ పరిస్థితి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 12 రిజిస్ట్రేషన్ కార్యాలయాలుండగా వాటిల్లో నాలుగు మాత్రమే సొంత భవనాలు కలిగి ఉన్నాయి. మిగిలిన కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటికి ప్రతి నెలా నెలా రూ.లక్షల్లో అద్దె చెల్లిస్తున్నారు. అద్దె భవనాల్లో కొనసాగే కార్యాలయాలకు ఇచ్చే క్రయవిక్రయ దారులు, ప్రజలు నిల్చునేందుకు కూడా కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వసతుల్లేవు. ఇబ్బందులు ఎదురవుతున్నా తప్పని పరిస్థితుల్లో ఆ భవనాల్లోనే కార్యాలయాలను కొనసాగిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే స్థలాలు చూసినప్పటికీ భవన నింర్మాణాలకు అవసరమైన నిధులు లేక ప్రక్రియ నిలిచిపోయింది.





అంతారంలో మైనింగ్‌ను వ్యతిరేకిస్తున్న గ్రామస్తులు

అంతారంలో మైనింగ్ అనుమతులివ్వొద్దు

చేవెళ్ల, జూన్ 23 : మండల పరిధి అంతారం పరిధిలోని పంచలింగాల గుట్ట వద్ద ఈ నెల 27న పర్యావరణ అనుమతుల కోసం నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని అంతారం గ్రామస్తులు తీర్మానించారు. ఆదివారం పంచాయతీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సర్వే నంబర్ 185లో ఉన్న 54ఎకరాల్లో ఎస్ఆర్ మినరల్స్ మైనింగ్ తవ్వకాల ప్రతిపాదనలను రద్దు చేయాలన్నారు. పర్యావరణ అనుమతులకు నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణను విరమించుకోవాలని కోరారు. ఇక్కడ మైనింగ్ చేపడితే వాయు, జల, ధ్వని కాలుష్యాలతో తాము ఇబ్బందులు పడుతామని గ్రామస్తులన్నారు. మైనింగ్ తవ్వకాలపై చేపట్టే ప్రజాభిప్రాయ సేకరణను తాము వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. మైనింగ్‌తో కాలుష్యంతో పాటు భవిష్యత్తులో గ్రామం మొత్తం ముంపునకు గురయ్యే ఆస్కారం ఉందన్నారు. పశువులకు మేత కరువుతుందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మైనింగ్ అనుమతులను వెంటనే రద్దు చేయాలని కోరారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సులోచన, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, నాయకులు నరేందర్, మాణిక్యం, వీరస్వామి, సుధాకర్, కుమార్, లక్ష్మీనారయణ, గ్రామస్తులు ఉన్నారు.



మన్‌సాన్‌పల్లిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లివ్వాలని ఆందోళన

- ఫ్లాట్లు పంపిణీ చేయిస్తానని ఎమ్మెల్యే సబిత హామీ

మహేశ్వరం, జూన్ 23 : మహేశ్వరం మండలం మన్‌సాన్‌పల్లిలో తమకు వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను కేటాయించాలని లబ్ధిదారులు ఆదివారం ఆందోళన చేశారు. 2018లో ప్రభుత్వం ఇక్కడ డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. నాలుగేళ్లపాటు రు.100కోట్లతో 2,412 ఫ్లాట్లను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించింది. ఇళ్లు లేని పేదలు దరకాస్తు చేసుకోగా కొందరిని ఎంపిక చేసి 21-9-2023న అప్పటి మంత్రి సబితారెడ్డి ఫ్లాట్ మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం అసెంబ్లీ ఎన్నికలు రావడంతో కోడ్ కారణంగా ఇళ్ల పంపిణీ నిలిచింది. ఎన్నికల అనంరతం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్ల పంపిణీ ప్రక్రియను చేపట్టింది. స్థానికంగా నిర్మించిన ఇండ్లను స్థానికేతరులకు కేటాయించారని పంపిణీ నిలిపేశారు. దీంతో అంతకు ముందు ఎంపికైన వారు ఆదివారం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద ఆందోళన చేశారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఫోన్లో వారితో మాట్లాడారు. త్వరలో సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని ఆమె హామీ ఇవ్వడంతో లబ్ధిదారులు ఆందోళన విరమించి వెళ్లిపోయారు.

ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లకు ఉత్తమ సేవా పతకాలు

షాద్‌నగర్ రూరల్, జూన్ 23: విధి నిర్వహణలో ప్రజలకు మెరుగైన సేవలందించినందుకు షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ లింగంలను ప్రభుత్వం పోలీసు ఉత్తమ సేవా పతకాలకు ఎంపిక చేసింది. షాద్‌నగర్ ఫైర్ ఆఫీసర్ జగన్ కూడా సేవాపతకానికి ఎంపికయ్యారు. ఈ మేరకు డీజీపీ రవిగుప్తా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఇన్‌స్పెక్టర్‌ను సన్మానించారు.



రంగస్వామి ఏసీపీ



ప్రతాప్‌లింగం ఇన్‌స్పెక్టర్

వర్షాలు కురవాలని 'వరదపాశం'

షాబాద్, జూన్ 23 : మృగశిర కార్తె వెళ్లి ఆరుద్ర వచ్చినా వర్షాలు పడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం ముద్దెంగూడ గ్రామస్తులు మల్లన్న ఆలయ ప్రాంగణంలో వరదపాశం(రాతి నేలపై బెల్లంపాశం) పోసి సామూహికంగా ఆరగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు, తుకాలు పోసేందుకు వానల కోసం ఎదురు చూస్తున్నామన్నారు. వర్షాలు పడి పాడి-పంటలు కలగాలని వరుణ దేవున్ని వేడుకున్నామన్నారు. కార్యక్రమంలో భారీ సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



వరదపాశాన్ని ఆరగిస్తున్న గ్రామస్తులు

ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్లతో... భయం.. భయం!

- ప్రమాదకరంగా రక్షణ లేని నియంత్రికలు.. కిందికి వేలాడుతున్న విద్యుత్ లైన్లు
- కర్రలే స్తంభాలుగా వినియోగం
- ప్రజల ప్రాణాలను లెక్కచేయని ట్రాన్స్‌కో అధికారులు

యాచారం, జూన్ 23 : రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లు, డీలాగా ఉన్న 11కేవీ/ఎల్టీ వైర్లు ప్రజల పాలిట మృత్యుపాశాలవుతున్నాయి. వీటితో జనావాసాలు, పొలాల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ వేయడం లేదు. అలాగే వైర్లు లూజుగా ఉన్నచోట్ల అదనపు స్తంభాలు పాతడం లేదు. కిందికి వేలాడుతున్న వైర్లను కనీసం బిర్రుగా కూడా చేయడం లేదు. ప్రజల ప్రాణాలంటే విద్యుత్ శాఖ అధికారులకు లెక్కలేకుండా పోయిందని గ్రామస్తులు అంటున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో చాలా ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయలేదు. గద్దెలపై విద్యుత్ నియంత్రికలు ప్రమాదకరంగా ఉన్నాయి. సమస్యలపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారుల దృష్టికి తెచ్చినా ఫలితం లేకుండా పోయింది. కొన్నిచోట్ల వెదురుకర్రలే స్తంభాలుగా పాతుకున్నారు. ఏడాది క్రితం నజ్దిక్‌సింగారంలో రోడ్డుపక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచలేక మేత మేస్తూ వెళ్లిన ఆవు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతిచెందింది. యాచారంలోని సాయినగర్‌లో ఇళ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ వేయాలని స్థానికులు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. చౌదర్‌పల్లిలో రోడ్డు పక్కనే సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచ లేదు. ఇదే గ్రామంలో ఇండ్ల మధ్య ట్రాన్స్‌ఫార్మర్ గద్దె శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇవన్నీ స్థానిక హెల్పర్లు, లైన్‌మన్, లెన్ ఇన్‌స్పెక్టర్లు చూస్తున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెప్పారు. సమస్యలపై ఏఈ, డీఈలకు విన్నవించినా, వినతిపత్రాలు అందజేసినా చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. కుర్మిద్దలో రోడ్డు పక్కన వెదురు కర్రకు ఎల్టీ వైర్లు బిగించారు. వర్షం వస్తే ఎర్తింగ్‌తో కరెంట్ షాక్ కొట్టడం ఖాయం. ఇక్కడ వెంటనే స్తంభం పాతాలని గ్రామస్తులు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదు. చిన్నతూండ్లలో ఇండ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను దూరంగా వేయాలని కోరినా పట్టించుకోవడం లేదని రైతులు చెప్పారు. మేడిపల్లి ఉన్నత పాఠశాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని, పాఠశాల ఆవరణలో 11కేవీ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని వేరే ప్రాంతం గుండావేయాలని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదు. నానక్‌నగర్‌లో పాఠశాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచ లేదు. కొత్తపల్లి, మేడిపల్లి, చౌదర్‌పల్లి, చిన్నతూండ్ల గ్రామాల్లో ఇండ్లపై ఎల్టీ వైర్లు కిందికి వేలాడుతున్నాయని, వాటిని తొలగించాలని లేదా ఎక్కువ ఎత్తుకైనా లాగాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సరిచేయడం లేదని ఇళ్ల యజమానులు వాపోతున్నారు.



నజ్దిక్‌సింగారంలో రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్



కుర్మిద్దలో రెండో వార్డులో కంచలేని ట్రాన్స్‌ఫార్మర్

దశలవారీగా సమస్యలన్నీ పరిష్కరిస్తాం



గ్రామాల్లో ఉన్న అన్ని ట్రాన్స్‌పార్మర్లకు దశలవారీగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇళ్లపై ఉన్న వైర్లను తొలగించేందుకు ఎస్టిమేషన్ వేశాం. ప్రస్తుతం డిపార్ట్‌మెంట్ బడ్జెట్ లేదు. ఎమ్మెల్యే నిధులతో పనులు చేయించేందుకు కృషి చేస్తున్నాం. విద్యుత్ వైర్లు ఉన్న చోట్ల వాటి కిందనే ఇళ్లు కట్టుకోడం సరికాదు. వైర్లకు కనీసం పదిఫీట్ల దూరం ఉండేలా నిర్మాణాలు చేసుకోవాలి.

- సందీప్‌కుమార్, ఏఈ, ట్రాన్స్‌కో

ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి



గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్‌లు వేయాలని అధికారులను కోరితే పట్టించుకోవడం లేదు. రోడ్డు పక్కనే ట్రాన్స్‌పార్మర్ ప్రమాదకరంగా ఉందని అధికారులకు చెబితే చూస్తాం.. చేస్తామంటున్నారుగానీ ఫెన్సింగ్ మాత్రం బిగించడం లేదు. 11కేవీ/ఎల్టీ వైర్లు లూజుగా వేలాడుతున్నాయి. చిన్నగాలి వస్తే షార్ట్ సర్క్యూట్ గంటలతరబడిగా కరెంటు పోతోంది. ఇక వర్షం కురిస్తే మరింత ప్రమాదకర పరిస్థితులు ఉంటున్నాయి.

కడారి శ్రీశైలం, నజ్దిక్‌సింగారం

ఇండ్లపై వైర్లను తొలగించడం లేదు



గ్రామంలో చాలా చోట్ల ఇండ్ల మీదినుంచి లాగిన 11కేవీ/ఎల్టీ వైర్లను తొలగించాలని అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదు. వైర్లు ఇండ్లపై నుంచి తొలగించి రోడ్డు వెంటవేయడం పెద్ద పనేమీ కాదు. కానీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ సమస్యలపై ఎంపీటీసీ, మాజీ సర్పంచ్‌లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేకుండ పోయింది. మరి సమస్యలు ఎవరు తీరుస్తారో అధికారులే చెప్పాలి.

- ఆలంపల్లి నర్సింహా, మేడిపల్లి

ప్రత్యేకాధికారులకే పగ్గాలు!

- స్థానిక సంస్థలన్నింటికీ వారే పాలకులు
- ఇప్పటికే జీపీలు.. ఇకపై మండల, జిల్లా పరిషత్‌లకు..!
- జూలై 4తో ముగియనున్న పాలక మండళ్ల గడువు
- జిల్లా స్థాయి అధికారులతో పరిపాలన
- నిధులు మాట దేవుడెరుగు.. నత్తనడకన అభివృద్ధి!



తాండూరు, జూన్ 23: మండల, జిల్లా పరిషత్తుకు ఎన్నికలు ఇప్పట్లో లేనట్టుగా సమాచారం. ఈ స్థానిక సంస్థలకు కూడా స్పెషలాఫీసర్ల(ప్రత్యేకాధికారులు) పాలన తప్పేటట్లు లేదు. మండల, జిల్లా పరిషత్‌ల పాలక మండళ్ల గడువు జూలై 4తో ముగియనుంది. ఇంకా సరిగ్గా 11 రోజుల గడువే మిగిలి ఉంది. ఈనెల 21న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగినా స్థానిక సంస్థల ఎన్నికల అంశం చర్చకు రాలేదు. దాంతో ఎన్నికలు ఇప్పట్లో లేనట్లేనని తేలిపోయింది. స్థానిక సంస్థల్లో ముఖ్యమైన గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన వెంటనే ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించిన విషయం విధితమే. ఇక జిల్లా, మండల పరిషత్ చైర్మన్ల పదవి కాలం ముగియనుంది. అయితే, వారిని యధావిధిగా కొనసాగిస్తారా? లేక ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగిస్తారా? అనే విషయమై జోరుగా చర్చ కొనసాగుతోంది. మండల స్థాయిలో గ్రామం యూనిట్‌గా ఎంపీటీసీ, మండల యూనిట్‌గా జడ్పీటీసీలకు ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికలు నిర్వహించాలంటే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుతో పాటు 45 రోజుల గడువు ఉండాలి. సమయం అంతలేదనేమో.. మరోవైపు రిజర్వేషన్ల ప్రక్రియ సంబంధించి పీఠముడి ఏర్పడింది.

కులగణనకు బీసీ సంఘాల పట్టు!

కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల ప్రక్రియ చేపట్టాలని, అప్పటి వరకు ఎన్నికలు నిర్వహించవద్దని బీసీ సంఘాలు, వివిధ ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం గత ఎన్నికలు జరిగినప్పుడు ప్రకటించిన రిజర్వేషన్లు పదేళ్ల పాటు కొనసాగాలనే నియమం ఉంది. ప్రస్తుతం రిజర్వేషన్లు చేసేందుకు వీలులేదని అధికారులు పేర్కొంటున్నారు. చట్ట సవరణ లేదా కులగణన చేపట్టాక రిజర్వేషన్ల ప్రక్రియ చేపట్టేందుకు అవకాశముందని చెబుతున్నారు. దాంతో ఎన్నికల నిర్వహణకు అనిశ్చితి ఏర్పాడింది. వీటన్నింటినీ పరిశీలించాక ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని, ఇంకా సమయం పడుతుందని రాజకీయ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.

అధికార పార్టీకి అనుకూలించేలా?

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా కులగణన చేపట్టనుంది. ఈమేరకు ప్రక్రియను రాష్ట్ర స్థాయిలో చేపట్టారు. ఎన్నికల హామీని అమలు చేయడంతో పాటు మరింత సమయం తీసుకొని ఆరు గ్యారంటీలు, ఇతర సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేసుకుంటూ ప్రజల్లోకి వెళ్తుందని అధికార పార్టీ వర్గాల అంచనా. క్షేత్ర స్థాయిలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను ఎక్కువ స్థానాల్లో గెలుపొంది పట్టు సాధించాలని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. ప్రస్తుతం స్థానిక సంస్థలలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులే ఎక్కువగా ఉన్న విషయం విధితమే. అక్టోబర్ వరకు ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ విషయమై వేచి చూసే అవకాశముంది.

తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్‌లో..

తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో గతంలో జరిగిన ఎన్నికలలో తాండూరు, బషీరాబాద్, కోట్‌పల్లి మండలాలు బీఆర్ఎస్ ఎంపీపీ స్థానాలను కైవసం చేసుకోగా.. పెద్దేముల్ మండలాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ప్రస్తుతం తాండూరు, బషీరాబాద్, కోట్‌పల్లి మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. పెద్దేముల్ మండలాధ్యక్షురాలు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి వెళ్లగా.. జడ్పీటీసీ మాత్రం కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు.

నిధులు రావడం కష్టమే!

స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే గ్రాంటు.. ఎన్నికలు నిర్వహించకుంటే నిలిచిపోయే అవకాశముంది. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు ఉపాధిహామీ పథకం నిధులు మండల, గ్రామ పంచాయతీలు వస్తున్నాయి. రాబోయే 16వ ఆర్థిక సంఘం నిధులు ఎన్నికలు సకాలంలో జరగకపోతే కేంద్రం నుంచి గ్రాంట్స్ రావటం ఆగిపోతాయని అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లా అధికారులే స్పెషలాఫీసర్లు

మండలాలకు ప్రత్యేకాధికారుల పాలన తీసుకొని వస్తే.. జిల్లా స్థాయిఅధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించనున్నారు. జిల్లా స్థాయిలోని అన్ని శాఖల అధికారులను నియమించనున్నారు. ఇప్పటికే పథకాల అమలు కోసం జిల్లాస్థాయి అధికారులు మండల, మున్సిపల్ ప్రత్యేకాధికారులుగా కొనసాగుతున్నారు. వారినే కొనసాగిస్తారా? లేక ఏమైనా మార్పులు జరుగుతాయా వేచి చూడాలి.

అన్నదాతకు ఆసరాగా కాంగ్రెస్ ప్రభుత్వం

- రుణమాఫీపై మాట నిలబెట్టుకున్న సీఎం
- సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, జూన్ 23 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసి మాట నిలబెట్టుకుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికలకు ముందు వరంగల్‌లో రాహుల్ గాంధీ రైతుల రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆయన ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని 39లక్షల మంది రైతులకు ఏకకాలంలో రూ. 31వేల కోట్ల రుణమాఫీని సీఎం రేవంత్‌రెడ్డి మాఫీ చేయనుండటం గమనార్హమన్నారు. ఒక్కో రైతుకు ఏకకాలంలో రూ. 2లక్షల రుణమాఫీ కానుండటంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో రైతుల కష్టాలను చూసే.. సీఎం రేవంత్ ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రుణమాఫీ కింద రూ. 13వేల కోట్లు వడ్డీ రూపంలో చెల్లించి రుణమాఫీ చేయకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. సమావేశంలో పార్టీ సీనియర్ నేతలు బాబర్‌ఖాన్, బాలరాజుగౌడ్, ఇబ్రహీం, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు బాలాజీని దర్శించుకున్న లెఫ్టినెంట్

మొయినాబాద్ రూరల్, జూన్ 23 : చిలుకూరు బాలాజీ వేంకటేశ్వరస్వామిని ఆర్మీ లెఫ్టినెంట్ ప్రీతిపాలసింగ్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు సీఎస్.రంగరాజన్ ఘనస్వాగతం పలికి స్వామివారి దర్శనాన్ని కల్పించారు. అనంతరం ఆలయ వైశిష్ట్యాన్ని ఆయనకు వివరించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు.



చిలుకూరు బాలాజీ ఆలయం వద్ద లెఫ్టినెంట్ గవర్నర్ ప్రీతిపాలసింగ్, కుటుంబ సభ్యులు

పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది కొరత


ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- ఇన్‌చార్జి డాక్టర్‌తోనే నెట్టుకొస్తున్న వైనం
- నిధులు లేక ఇబ్బందులు!.. రోగుల అవస్థలు

మాడ్గుల, జూన్ 23 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరిపడా వైద్యసిబ్బంది లేక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. మాడ్గుల పీహెచ్‌సీలో వైద్యాధికారి మోహన్ విధులు నిర్వహిస్తున్నారు. అయితే, ఆయన మండల పరిధిలోని కొల్కులపల్లి దవాఖానలో కూడా ఇన్‌చార్జి డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మాడ్గుల దవాఖానలో సిబ్బంది లేక నానా అవస్థలు పడుతున్నట్లు ఆయన తెలిపారు. కాగా, ఒక డాక్టర్, స్టాఫ్ నర్స్ ఇద్దరికి ఒక్కొక్కరు మాత్రమే ఉన్నారని, ఫార్మాసిస్ట్, డాటా ఎంట్రీ ఆపరేటర్, వాచ్‌మ్యాన్, అసిస్టెంట్లు లేరని ఆయన చెప్పారు. అదనంగా మరో డాక్టర్‌ను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, సరిపడా సిబ్బందిని నియమించాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు డాక్టర్ మోహన్ తెలిపారు. కాగా, మండలంలో 6 ఆరోగ్య ఉపకేంద్రాలున్నాయని, ఆరుగురు డాక్టర్లకు ముగ్గురు మాత్రమే ఉన్నారని చెప్పారు. అయితే, ఉపకేంద్రాలకు సరైన బిల్డింగులు లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. కేవలం కొల్కులపల్లి ఉపకేంద్రానికి మాత్రమే సొంత భవనం ఉందని, మిగతా సెంటర్లు గ్రామపంచాయతీ భవనాల్లోనే కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. కాగా, మూడేళ్లుగా పీహెచ్‌సీకి సంబంధించిన అభివృద్ధి పనుల బిల్లులు మంజూరు కాలేదని తెలిపారు. విద్యుత్ లైట్ల ఏర్పాటు, వాటర్‌ట్యాంకులు, ఫ్యాన్ల మరమ్మతులు దాతల సాయంతో చేయించామని తెలిపారు. కాగా, పీహెచ్‌సీకి రెండేళ్ల క్రితం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఏమిరెడ్డి జైపాల్‌రెడ్డి అంబులెన్స్‌ను అందజేశారు. డ్రైవర్ లేకపోవడంతో అది మూలనపడిందని మండల ప్రజలు వాపోతున్నారు. ఆరోగ్య కేంద్రంలో అన్ని వైద్య సేవలు అందుబాటులో ఉండేలా అధికారులు చొరవ తీసుకోవాలని, సిబ్బంది నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


సభావత్ చందు నాయక్‌ను అభినందిస్తున్న తల్లిదండ్రులు

'జేఈఈ అడ్వాన్స్‌డ్'లో మెరిసిన గిరిజన విద్యార్థి

శంకర్‌పల్లి, జూన్ 23 : మోకిల తండాకు చెందిన సభావత్ చందు నాయక్ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో సత్తా చాటాడు. ఎన్‌టీఏ ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో ఆల్ ఇండియాలో 91 మార్కులతో 407 (ఎస్టీ కేటగిరీ) ర్యాంకు సాధించాడు. యూసఫ్‌గూడలోని గురుకుల పాఠశాలలో 5 నుంచి 10వ తరగతి వరకు చదువుకున్నాడు. కూకట్‌పల్లిలోని నారాయణ కళాశాలలో ఇంటర్మీడియెట్ పూర్తిచేశాడు. ఇందులో 966 మార్కులు సాధించాడు. తండ్రి శంకర్ సెంట్రింగ్ పనిచేస్తుండగా, తల్లి దేవి వ్యవసాయ కూలీ. తమ బిడ్డ మంచి ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు శంకర్, దేవిలు న్యాయవాది రవిలు ఆదివారం స్వీట్ తినిపించి సంతోషం వ్యక్తం చేశారు. ఐఐటీలో సివిల్ ఇంజనీరింగ్ చేసి ఉన్నతంగా ఎదగడమే ధ్యేయమని చందునాయక్ తెలిపాడు.


సీఎంకు వినతి పత్రం సమర్పిస్తున్న టీయూటీఎఫ్ నేతలు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

రంగారెడ్డి అర్బన్, జూన్ 23 : పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మ పాటిమీది రఘు నందన్‌రెడ్డి కోరారు. ఈమేరకు ఆదివారం ఆయన సీఎం రేవంత్ రెడ్డి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను నగరంలో కలిశారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని, ఉపాధ్యాయ బదిలీలు ప్రమోషన్లకు సంబంధించిన పలు అంశాలపై సీఎంకు వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లగా పదోన్నతులు, బదిలీల కొరకు నిరీక్షిస్తున్న ఉపాధ్యాయుల కలలను నెరవేర్చిన సీఎంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులకు రూ.16 లక్షలు మంజూరు


జడ్పీటీసీకి ప్రొసీడింగ్ అందిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

ఆమనగల్లు, జూన్ 23: మండలంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి జిల్లా పరిషత్ నిధుల రూ.16 లక్షలు మంజూరైనట్లు జిల్లా సాంఘిక సంక్షేమ స్టాండింగ్ కమిటీ చైర్మన్, జడ్పీటీసీ అనురాధపత్యానాయక్ తెలిపారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆదివారం అనురాధ పత్యానాయక్‌కు జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి ప్రొసీడింగ్‌లు అందజేశారు. పులిగోనిపల్లి, సీతారాంనగర్ తండాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.5లక్షలు, మేడిగడ్డ తండాకు రూ.5లక్షలు, రాంనుంతల పెద్దతండాకు రూ.4 లక్షలు, కేస్యతండాకు రూ.లక్ష, శంకర్‌కొండ తండాకు రూ.లక్ష చొప్పున నిధులు కేటాయించినట్లు ఆమె వివరించారు. మరికొన్ని గ్రామాలు, తండాలలో సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వల నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరు చేయిస్తామని చెప్పారు. ఆమనగల్లు మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పరిచి ఆదర్శంగా నిలుపుతామని అనురాధ పేర్కొన్నారు.


కుక్కల దాడిలో మృతి చెందిన లేగ దూడలు(ఫైల్)

మెదక్‌పల్లిలో కుక్కల బెడద

- లేగదూడలపై దాడి.. ఆందోళన చెందుతున్న రైతులు
- వారం వ్యవధిలో 10 ఆవులు, దూడల మృత్యువాత

ఆమనగల్లు, జూన్ 23: మండలంలోని మెదక్‌పల్లి గ్రామంలో కుక్కల బెడద తీవ్రమైంది. పొలాల వద్ద లేగ దూడలపై దాడిచేస్తూ చంపేస్తున్నాయి. రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో చాలామంది రైతులు పాడిపరిశ్రమ ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో పొలాల వద్ద ఏర్పాటు చేసుకున్న పశువుల కొట్టాలలో ఆవులు, దూడలను కట్టేసి వస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో గ్రామానికి చెందిన వెంకటేశ్వర్ రెడ్డికి చెందిన నాలుగు, ప్రతాప్‌రెడ్డికి చెందిన రెండు, బాల్‌రాజ్‌కు చెందిన రెండు, వెంకటయ్యకు చెందిన రెండు దూడలు, బక్కయ్యకు చెందిన ఒక లేగదూడ కుక్కల దాడిలో గాయపడి మృతిచెందాయి. రోజురోజుకూ కుక్కల దాడులు అధికమవుతుండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. లక్షల రూపాయలు ఖర్చుచేసి పాడి పరిశ్రమ చేపట్టిన రైతులు కుక్కల దాడుల మూలంగా లేగ దూడలు మృతి చెంది నష్టపోతున్నారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

డ్రైనేజీ లైన్ వేశారు.. రోడ్డు మరిచారు



మేడ్చల్ టౌన్, జూన్ 23: మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 4వ వార్డు కిష్టాపూర్ వీకర్‌సెక్షన్ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ వేయడానికి రోడ్డు తవ్వి వదిలేయడంతో స్థానిక ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ లైన్ కోసం సీసీరోడ్డు మధ్య తవ్వి పైప్‌లైన్ పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నప్పటికీ రోడ్డును మాత్రం తిరిగి నిర్మించడంలేదు. ఈ విషయం పట్ల స్థానిక ప్రజలు పలుమార్లు స్థానిక కౌన్సిలర్‌కు, మున్సిపల్ అధికారులకు తెలిపినా వారు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావటంతో గుంతలమయంగా మారిన రోడ్డులో వర్షం నీరు ఆగి స్థానికులు రోడ్డుపై నడవని దయనీయ పరిస్థితి నెలకొందని స్థానికులు అంటున్నారు. నిధులులేని కారణంగా రోడ్డునిర్మాణం చేపట్టడం కష్టమని స్థానిక మున్సిపల్ అధికారులు చేతులెత్తేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే రోడ్డు పనులు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

జమకాని గ్యాస్ సబ్సిడీ!

'మహాలక్ష్మి' లబ్ధిదారుల ఆందోళన
బ్యాంకులు, గ్యాస్ ఏజెన్సీల చుట్టూ ప్రదక్షిణలు



చేవెళ్ల, జూన్ 22 : రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద అర్హులైన వారందరికీ రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ అందజేస్తామని ప్రకటించింది. అయితే, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ లబ్ధిదారులకు వంటగ్యాస్ సబ్సిడీ రావడం లేదు. దాంతో లబ్ధిదారులు ప్రభుత్వం ఇచ్చిన హామీపై నమ్మకం కోల్పోయే పరిస్థితి నెలకొంది. తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతీ కుటుంబానికి రాయితీపై సిలిండర్ అందజేయాలని గ్యాస్ ఏజెన్సీలకు ప్రభుత్వం ఆదేశాలు సైతం జారీ చేసింది. దాంతో అర్హులైన వారు ఏజెన్సీల నుంచి సిలిండర్లు పొందుతున్నారు. ఇందులో చాలామంది బ్యాంకు ఖాతాల్లో మహాలక్ష్మి పథకం రాయితీ జమ కావడం కావడంలేదని వాపోతున్నారు. లబ్ధిదారులు గ్యాస్ ఏజెన్సీలు, గ్రామ పంచాయతీ, ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. డబ్బులు జమకాకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులను అడిగితే ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదని చెబుతున్నారు. ఇప్పటివరకు కేంద్రం నుంచి వస్తున్న సబ్సిడీ రూ.40. 70 పైసలు యథావిధిగా వస్తుందని పేర్కొన్నారు.

సవరణలకు నో ఛాన్స్..

ప్రజాపాలన కింద కొత్తగా దరఖాస్తు చేసుకుందామని భావించిన వారికి ప్రస్తుతం నిరాశే ఎదురవుతోంది. ప్రజాపాలన వెబ్‌సైట్‌ను జనవరి 6 తర్వాత నిలిపివేసిన ప్రభుత్వం.. తిరిగి తెరువలేదు. ఫలితంగా కొత్త దరఖాస్తుల స్వీకరణకే పరిమితమవుతున్నారే తప్ప.. వాటిని ఆన్‌లైన్ చేసే అవకాశం లేకుండా పోతోంది. అలాగే దరఖాస్తు సమయంలో తప్పుగా నమోదైన వివరాలు సైతం సరిచేసుకునే అవకాశం లేకుండా పోయింది. ఈ కారణాలతో చాలామంది ప్రయోజనం పొందలేకపోతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

డేటా అప్‌డేట్ చేసుకున్నా అందని రాయితీ

మహాలక్ష్మి పథకం కింద అర్హులైన వారి ఎంపిక కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులను స్వీకరించింది. సబ్సిడీ సిలిండర్ కోసం పెద్దసంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. వీటిని ప్రభుత్వం ప్రజాపాలన వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ చేయించింది. అయితే, ఆ సమయంలో ఆపరేటర్లు వివరాలను సరిగా నమోదు చేయకపోవడం, లబ్ధిదారులు గ్యాస్ కనెక్షన్, ఆధార్ వివరాలు సరిగా అందించకపోవడంతో చాలా మంది ఈ పథకం కింద లబ్ధి పొందలేకపోయారనే ఆరోపణలున్నాయి. దీన్ని గుర్తించిన ప్రభుత్వం అలాంటివారి వివరాలు సరిచేసుకునేందుకు ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల వద్దకు వెళ్లి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేసి సరి చేసుకున్నారు. అయినప్పటికీ వేలాది మందికి రాయితీ జమకావడం లేదని వాపోతున్నారు.

సబ్సిడీ రావడం లేదు



మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత రెండు సార్లు వంట గ్యాస్ సిలిండర్లు తీసుకున్నా. అయితే నా బ్యాంకు ఖాతాలో మాత్రం ప్రభుత్వం ప్రకటించిన రాయితీ డబ్బు జమకాలేదు. గ్యాస్ ఏజెన్సీతో పాటు ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించినా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని చెబుతున్నారు.

\- ఎం.సరిత, గృహిణి, కమ్మెట, చేవెళ్ల మండలం

సిలిండర్‌పై రాయితీ చెల్లించాలి



రెండు నెలలుగా వంటగ్యాస్ సిలిండర్లు తీసుకున్నప్పటికీ బ్యాంకు ఖాతాలో సబ్సిడీ జమకాలేదు. బ్యాంకులో సంప్రదించగా ప్రజాపాలన దరఖాస్తు కేంద్రంలో వివరాలు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో అప్‌డేట్ చేసి రెండు నెలలవుతున్నా ఇప్పటికీ రాయితీ జమ కాలేదు.

\- వడ్ల వాణి, గృహిణి, మల్కాపూర్, చేవెళ్ల మండలం


మంత్రి కృష్ణారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బొజ్జ సాయిరెడ్డి

మంత్రి జూపల్లిని కలిసిన విజయ డెయిరీ చైర్మన్

ఆమనగల్లు, జూన్ 23: మాడ్గుల విజయ డెయిరీ చైర్మన్‌గా ఎన్నికైన కొల్కులపల్లి గ్రామానికి చెందిన బొజ్జ సాయిరెడ్డి ఆదివారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, పాడిపరిశ్రమ సమాఖ్య ఎండీ లక్ష్మీలను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమనగల్లు మాజీ మార్కెట్ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు సూదిని కొండల్ రెడ్డిలతో హైదరాబాద్‌లోని వారి కార్యాలయాల్లో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. చైర్మన్‌గా ఎన్నికైన సాయిరెడ్డిని వారు అభినందించారు. పాడిరైతులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించేలా చూడాలని మంత్రి, ఎమ్మెల్యే ఎండీలను కోరగా సానుకూలంగా స్పందించినట్లు సాయిరెడ్డి తెలిపారు.

మల్లు రవి ప్రమాణ స్వీకారానికి ఢిల్లీ వెళ్లిన కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు, జూన్ 23: మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి ప్రమాణ స్వీకారం నేపథ్యంలో ఆమనగల్లు పట్టణంలో సంబురాలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా నాయకులు మండ్లీ రాములు, గుర్రం కేశవులు, కాలే మల్లయ్య, పట్టణాధ్యక్షుడు మానయ్యల ఆధ్వర్యంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. నాయకులు గండికోట మల్లేశ్, నేనావత్ రవీందర్ నాయక్, జంతుక యాదయ్య, తదితరులు ఉన్నారు.

అద్దె గదిలోనే బోధన

శిథిలావస్థలో ధర్మాపూర్ ప్రాథమిక పాఠశాల

- మన ఊరు-మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎంపిక.. ముందుకు సాగని భవన నిర్మాణ పనులు
- డిప్యుటేషన్‌పై రెగ్యులర్ ఉపాధ్యాయుడు


శిథిలావస్థలో ఉన్న ధర్మాపూర్ ప్రాథమిక పాఠశాల

కొడంగల్ రూరల్, జూన్ 23 : ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం లక్షలాది రూపాయలు కేటాయిస్తోంది. నూతన పాఠశాలల భవనాలు, అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నా కొన్ని పాఠశాలలు దుస్థితిలోనే ఉన్నాయి. కొడంగల్ మండలంలోని ధర్మాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరింది. దాంతో ఓ భవనం అద్దెకు తీసుకొని తరగతులు బోధిస్తున్నారు. గత ప్రభుత్వం మన ఊరు-మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల కింద మండలంలోని 36 ప్రాథమిక, 10 ప్రాథమికోన్నత, 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించడంతో పనులు చేపట్టారు. ఒక్క ధర్మాపూర్ ప్రాథమిక పాఠశాలలో మాత్రం పనుల ఊసేలేదు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో కూలేందుకు సిద్ధంగా ఉందని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికీ అద్దె భవనంలోనే తరగతి గదులను కొనసాగిస్తున్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. టేకుల్‌కోడ్ పాఠశాల ఉపాధ్యాయుడు ధర్మాపూర్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాడు. అయితే, గత సంవత్సరం 12మంది విద్యార్థులుండగా.. అందులో 6వ తరగతిలో చేరేందుకు ముగ్గురు ఇతర పాఠశాలలకు వెళ్లారు. ప్రస్తుతం 9 మంది విద్యార్థులు మాత్రమే విద్యనభ్యసిస్తున్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇద్దరు విద్యార్థులు మొదటి తరగతిలో చేరినట్లు గ్రామస్థులు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని కూల్చివేసి నూతన భవనం, రెగ్యులర్ ఉపాధ్యాయుడిని నియమించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


అద్దె గదిలో కొనసాగుతున్న తరగతులు


జెండాను ఆవిష్కరిస్తున్న జంగయ్య

కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం

షాబాద్, జూన్ 23 : కార్మికుల సమస్యల కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటం చేస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలో హైతాబాద్ పారిశ్రామిక వాడలో ఏర్పాటుచేసిన ఏఐటీయూసీ నూతన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చాలా పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయని వేలాదిగా కార్మికులు ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నారని, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఆ కార్మికులకు అండగా ఉండాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యాల దోపిడీకి వ్యతిరేకంగా ఏఐటీయూసి పోరాటాలు నిర్వహించాలని సూచించారు. అంతనరాష్ట్రాల నుంచి వస్తున్న కార్మికులకు చట్టబద్ధంగా 50శాతం జీతాలు ఎక్కువ ఇవ్వాల్సి ఉన్నా.. ఏ ఒక్క యాజమాన్యం అమలు చేయడం లేదన్నారు. కార్మికుల పొట్టలు కొట్టే పరిశ్రమ యాజమాన్యాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పర్వతాలు, వర్కింగ్ ప్రెసిడెంట్ రామస్వామి, కార్యదర్శి సత్యనారాయణ, మండల కార్యదర్శి జంగయ్య, రఘురాం, మధు, మంజుల, రాములు, జాంగీర్ తదితరులు పాల్గొన్నారు.

పాముల కాలం.. జరభద్రం

- వానాకాలంలో పొంచి ఉన్న ప్రమాదం
- మూఢ నమ్మకాలతో ప్రాణాలకు ముప్పు
- వ్యవసాయ పనుల్లో రైతులు, కూలీలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



బషీరాబాద్, జూన్ 23: వానాకాలంలో పుట్టలు, పొదల్లోంచి పాములు, తేళ్లు ఇతర విష కీటకాలు తరుచూ బయటకొచ్చి మనుషుల పాలిట ప్రాణాంతకంగా మారతాయి. వ్యవసాయ పనుల్లో ఉంటే రైతులు, కూలీలు పాము కాటుకు గురై మృతిచెందిన సందర్భాలు అనేకమున్నాయి. పాము, తేలు కాటు వేసినప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది మంత్రాలు, చెట్ల మందులు వంటి మూఢనమ్మకాలను నమ్మి ప్రాణాల మీదికి తెచ్చుకుంటారు. ఎవరైనా పాము కాటుకు గురైతే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి. పాము కరిచిన వ్యక్తి వీలైనంత తొందరగా ఆస్పత్రికి వెళ్తే వైద్యులు విషం విరుగుడుకు యాంటీ స్నేక్ వినమ్ ఇంజక్షన్ ఇస్తారు. చికిత్సతోనే పాము కాటు బాధితులు ప్రాణాలతో బయటపడతారు. జూన్ నుంచి సెప్టెంబరు వరకు పాములు, ఇతర కీటకాల బెడద ఎక్కువగా ఉంటుంది. ఇళ్లలో ధాన్యపు గాదెలు, పొదలు, పొలం గట్లు, చొప్ప కుప్పలు, గడ్డివాములు వంటి మొదలైన వాటిల్లో కప్పలు, ఎలుకలు తిరుగుతుంటాయి. ఆయా ప్రాంతాల్లో పాములకు ఆహారం సమృద్ధిగా ఉండటంతో అక్కడే సంచరిస్తుంటాయి. కొన్నిసార్లు వాటిలో గుడ్లు పెట్టి పిల్లలు చేస్తాయి. అలాంటి ప్రదేశాల్లో మనం జాగ్రత్తగా ఉండాలి. ఇళ్ల మధ్య, పరిసరాల్లో పొదలు లేకుండా చూసుకోవాలి. పొలంగట్లపై నడిచేటప్పుడు కట్టెలతో చప్పుడు చేసుకుంటూ నడవడం సురక్షితం. రాత్రివేళలో బయటకు వెళ్తే కచ్చితంగా టార్చిలైటు తీసుకుని వెళ్లాలి.

పాము ఎప్పుడు కాటేస్తుందంటే?

పొలం గట్లు, కాలువ గట్లు, పశువుల పాకలు, గుబురు ప్రదేశాలు, పొదలు, గడ్డివాములు, పాడుబడిన ఇళ్లు, కట్టెలు, పెంటదిబ్బల్లో పాములు తిష్టవేసి బల్లులు, తొండలను పట్టుకుని తింటాయి. పాములకు చెవులు వినపడనప్పటికీ వాటి శరీరం కింద భాగంగా ఉండే ప్రత్యేక పొలుసుల ద్వారా శబ్ద ప్రకంపనలను గ్రహిస్తాయి. వేడి ప్రవహించే జంతువులు, మనుషులు సమీపిస్తే వెంటనే గుర్తించి కాటేస్తాయి. ముఖ్యంగా పాములకు ప్రాణ భయం ఉన్నప్పుడు ఏకాంతానికి భంగం వాటిల్లినప్పుడు వాటిని తొక్కినప్పుడు, వేటాడినప్పుడు మాత్రమే అవికాటేస్తాయి.

పాములన్నీ విషపూరితం కావు

పాముల్లో చాలా వాటికి విషం ఉండదు. తాచు, కట్లపాము, నాగుపాము వంటి కొన్ని రకాల పాములు విషపూరితమైనవి. పాము కరిచినప్పుడు చాలా మంది భయానికి లోనై ప్రాణాలు కోల్పోతుంటారని వైద్యులు చెబుతుంటారు. కట్లపాము కాటేసిన క్షణాల్లోనే విషం రక్తకణాల్లో కలుస్తుంది. ప్రమాద తీవ్రతను దృష్టిలో పెట్టుకుని వెంటనే బాధితుడిని ఆస్పత్రిలో చేర్పించాలి. నాగుపాము కాటేసిన 15నిమిషాల్లోనే మనిషికి విషం ఎక్కుతుంది. ఆ లోపు ఆసుపత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేయాలి. రక్త పింజర కాటేసిన రెండు గంటల్లోగా విషం ఎక్కుతుంది. జెర్రిపోతు, నీరుకట్ట కాటేసినా ఏమీకాదు. వాటికి విషం ఉండదు. అయితే కాటేసిన వెంటనే ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుంటే మంచిది. విషపూరిత పాము కాటేస్తే మనిషి శరీరం నీలంరంగులోకి మారుతుంది. రక్తపోటు ఎక్కువగా ఉంటే స్పృహ కోల్పోతారు. పాము కరిచిన చోట నొప్పి, వాపు ఉంటుంది. కొందరిలో పొక్కులు, దద్దుర్లు వస్తాయి. నోటి నుంచి నురుగ వస్తుంది.

పాము కరిచినప్పుడు ఆందోళన చెందవద్దు



పాము కరిచినప్పుడు బాధిత వ్యక్తి ఆందోళన చెందవద్దు. ఆసుపత్రిలో పాము కాటుకు సంబంధించిన యాంటీ స్నేకివీనమ్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. పాము కరిచిన వెంటనే బాధితుడిని ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి తీసుకురావాలి. చెట్ల మందులు, మంత్రాలు వంటివి నమ్మి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు. ముఖ్యంగా వర్షాకాలం పాములు ఎక్కువగా సంచరిస్తుంటాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉంటూ పనులు చేసుకోవాలి.

\- డాక్టర్.శ్రీకాంత్, బషీరాబాద్ పీహెచ్‌సీ వైద్యులు

శ్యామాప్రసాద్ ఆశయాలను కొనసాగిద్దాం

● భారతీయ జనతా పార్టీ నాయకులు..
● శ్యామాప్రసాద్ ముఖర్జీకి వర్ధంతి.. ఘన నివాళి



చేవెళ్ల : శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



షాద్‌నగర్ : శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

షాద్‌నగర్, జూన్ 23 : జనసంఘ్ నేత డాక్టర్ శ్యామాప్రసాద్ ఆశయాలను కొనసాగిస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం తన నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆర్టికల్ 370 రద్దు కోసం అనేక ఉద్యమాలు చేసి బలిదానం అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మోహన్‌సింగ్, ఇస్నాతి శ్రీనివాస్, లష్కర్‌నాయక్, గంగాధర్, వెంకటేష్, కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట : ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల : భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు, కేంద్ర మాజీ మంత్రి, ఆర్టికల్ 370ని రద్దు చేయాలని పిలుపునిచ్చిన దివంగత డాక్టర్ శ్యామా ప్రసాద్ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను కొనసాగిద్దామని బీజేపీ చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకట్ రాంరెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, కుంచం శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఆదివారం శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. బీజేపీ నాయకులు మల్గారి వైభవ్‌రెడ్డి, మచేందర్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, గణేశ్, నవీన్‌రెడ్డి, చాకలి శ్రీనివాస్, దామోదర్, వెంకట్, జయసింహరెడ్డి, కృష్ణమోహన్, వెంకటేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేశంపేట : జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని మండల కేంద్రంలోని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ సమగ్రతకు శ్యామాప్రసాద్ చేసిన సేవలు గుర్తుచేసుకున్నారు. భారతదేశంలో రెండు విధానాలు, ఇద్దరు ప్రధానులు అనే విధానాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించిన తీరును గుర్తుచేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాముకాముల గౌడ్, శివాజీ, ఉడుత హరికృష్ణ, నరసింహులు, పాండురంగా రెడ్డి, లక్ష్మన్, రాజు, శ్రీను, రమేష్, మహేష్, వినయ్, శంకర్ తదితరులున్నారు.

యాచారం : పేదల ఉద్ధరణకు పరితపించిన గొప్ప నేత శ్యామాప్రసాద్ ముఖర్జీ సేవలు ప్రశంసనీయమని బీజేపీ మండలాధ్యక్షుడు తాండ్ర రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. నెహ్రూమంత్రివర్గంలో పరిశ్రమల శాఖ మంత్రిగా సేవలందించారన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నడికూడి కృష్ణ, బీజేపీ నాయకులు గొల్లపల్లి జంగయ్యగౌడ్, కిషన్, సత్తిరాజు, గొరిగే బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం : దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భరతమాత ముద్దుబిడ్డ శ్యామాప్రసాద్ ముఖర్జీ త్యాగం మరువలేనిదని బీజేపీ జాతీయ కిసాన్‌మోర్చా కార్యవర్గసభ్యుడు బసవ పాపయ్యగౌడ్ అన్నారు. మండలంలోని అమీర్‌పేట గ్రామంలో అయ్యప్ప, శ్రీ వేంకటేశ్వర ఆలయాల ప్రాంగణాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిద్దె సుదర్శన్‌రెడ్డి, కాసాని వెంకటేష్‌గౌడ్, దేశ్యానాయక్, యాదయ్య, నందీశ్వర్, మాధవాచారి తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం : అమీర్‌పేట ఆలయం వద్ద మొక్కలు నాటుతున్న నాయకులు



యాచారం : శ్యామాప్రసాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కార్యకర్తలు

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ రైతు మృతి

● పది రోజుల క్రితం పాటుకాటుకు గురైన అన్నదాత

యాచారం, జూన్ 23 : పొలం పనులు చేస్తుండగా పది రోజుల క్రితం పాముకాటుకు గురైన రైతు నగరంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. యాచారం మండలంలోని నానక్‌నగర్‌కు చెందిన కప్పు సత్తయ్య(80) పది రోజుల క్రితం తన వ్యవసాయ పొలంలో పొలం పనులు చేస్తుండగా పాముకాటు వేసింది. కుటుంబికులు వెంటనే చికిత్స కోసం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత



మృతి చెందిన ఆవు

తలకొండపల్లి, జూన్ 23: విద్యుదాఘాతానికి గురై ఆవు మృతిచెందిన సంఘటన మండలంలో వీరన్నపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బెక్కరి వెంకటొరెడ్డి రోజు మాదిరిగానే వ్యవసాయ పొలం వద్ద ఆవులను మేపుతున్నాడు. ఈక్రమంలో పొలంలో ఉన్న విద్యుత్ వైర్లకు ఆవు తగిలి విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. పాడి ఆవు విలువ రూ.లక్ష ఉంటుందని, ప్రభుత్వ పరంగా తనను ఆదుకోవాలని రైతు వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

ఫిజికల్ డైరెక్టర్లకు కనీస వేతనం ఇవ్వాలి



రేవంత్‌రెడ్డికి వినతిప్రతం ఇస్తున్న ఫిజికల్ డైరెక్టర్లు

చేవెళ్ల, జూన్ 23 : తెలంగాణ మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లకు కనీస వేతనం చెల్లించాలని పీడీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజనేయులు, కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డిలు కోరారు. ఈమేరకు ఆదివారం రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, గౌరవాధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తదితరులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పటి నుంచి జీవో 254 ప్రకారం ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నమని చెప్పారు. ఏపీలో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లకు కనీస వేతనం ఇస్తున్నారని గుర్తుచేశారు. తెలంగాణలో కనీస వేతనాలు అందించాలని సీఎం రేవంత్‌ను కోరినట్లు వారు పేర్కొన్నారు. దాంతో సీఎం సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి బీజేపీలో చేరిక : పీవీఆర్



బీజేపీలో చేరిన వారితో పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

కొత్తూర్, జూన్ 23: ప్రధాని నరేంద్రమోదీ దేశంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఆయా పార్టీల నాయకులు బీజేపీలో చేరుతున్నారని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి(పీవీఆర్) అన్నారు. మండల పరిధిలోని పెంజర్ల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బుర్కపురం రఘుపతిరెడ్డి, షాద్‌నగర్ రైతు కాలనీకి చెందిన గోపాల్‌రెడ్డిలు ఆదివారం విష్ణువర్ధన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి పార్టీలో చేరారు. వారికి విష్ణువర్ధన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పీవీఆర్ మాట్లాడుతూ 1976లో ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ సమయంలో రఘుపతిరెడ్డి జైలుకు వెళ్లడం జరిగిందని, అటువంటి వ్యక్తి ఈ రోజు బీజేపీలో చేరడం శుభసూచకమన్నారు. రఘుపతిరెడ్డికి విష్ణువర్ధన్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ భవనాన్ని ప్రారంభించాలి

● కావాలనే జాప్యం చేస్తున్న ఎమ్మెల్యే ● జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్



ఆమనగల్లు, జూన్ 23:కోట్ల రూపాయాలు వెచ్చించి నిర్మాణం పూర్తి చేసిన కస్తూర్బా గాంధీ గిరిజన బాలికల విద్యాలయ భవనాన్ని వెంటనే ప్రారంభించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ సభ్యుడు, జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 15 రోజులు అయినా భవనాన్ని ప్రారంభించకుండా కాలయాపన చేయడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కడ్తాల్ మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దశరథ్ మాట్లాడుతూ కేజీబీవీ భవనాన్ని వెంటనే ప్రారంభించకపోతే విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. భవనం ప్రారంభిస్తే ప్రొటోకాల్ ప్రకారం శిలాఫలకంపై జడ్పీటీసీ అయిన తన పేరు పెట్టాల్సి వస్తుందనే కుట్రతోనే ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. తమ పదవి కాలం జూలై 4న ముగిసే వరకు భవనం ప్రారంభించకూడదని, తానే అడ్డంకి అని భావిస్తే విద్యార్థుల మేలు కోసం వెంటనే తన పదవికి రాజీనామా చేస్తానని దశరథ్ నాయక్ ప్రకటించారు. ఏ ఉద్దేశ్యంతో భవనం ప్రారంభం విషయంలో జాప్యం చేస్తున్నారో తమకు తెలుసునని పేర్కొన్నారు. భవన ప్రారంభానికి మంత్రి సమయం ఇవ్వడం లేదని ఎమ్మెల్యే సాకులు చెబుతున్నారని, విద్యాశాఖకు మంత్రి లేనప్పుడు ఎవరు వచ్చి ప్రారంభిస్తారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణానికి రూ. 3.50 కోట్లు మంజూరు చేయించి భవన నిర్మాణం పనులు పూర్తి చేయించడం జరిగిందన్నారు. కేజీబీవీ భవన ప్రారంభానికి మంత్రి సమయం ఇవ్వడం లేదని పేర్కొంటున్న ఎమ్మెల్యే.. అధికార పార్టీకి చెందిన సీనియర్ ఎంపీ అయిన మల్లు రవితో ప్రారంభించవచ్చు కదా? అని అన్నారు. ఇప్పటికైన ఎమ్మెల్యే కాలయాపన చేయకుండా పూర్తైన భవనాన్ని వెంటనే ప్రారంభించేలా చూడాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఆనంద్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్‌ఎం అధ్యక్షుడు వీరయ్య, ఎంపీటీసీ గోపాల్, నాయకులు తులసీరామ్ నాయక్, హరిచంద్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

బెల్లయ్య నాయక్‌ను కలిసిన కృష్ణనాయక్

ఆమనగల్లు, జూన్ 23: పీసీసీ ఆదివాసీ సెల్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌ను ఆదివారం యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు కృష్ణనాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావం వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న బెల్లయ్య నాయక్‌ను కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో గిరిజనుల స్థితిగతులు, తండాలలో నెలకొన్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకుపోగా, పరిష్కారానికి ప్రభుత్వపరంగా కృషిచేస్తానని తెలిపినట్లు కృష్ణనాయక్ పేర్కొన్నారు.

గోర్ బంజారా జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

● ఎల్‌హెచ్‌పీఎస్ సమన్వయ కమిటీ కన్వీనర్ రాంబల్ నాయక్



కేశంపేట, జూన్ 23: లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో జూలై 1న హైదారాబాద్‌లో నిర్వహించే గోర్ బంజారా జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర సమన్వయ కమిటీ కన్వీనర్ మూడావత్ రాంబల్ నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ లంబాడ హక్కుల సాధన కోసం ఎల్‌హెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బెల్లయ్య నాయక్ నేతృత్వంలో గోర్ బంజారా జాతీయ సమ్మేళనం నగరంలోని రవీంద్ర భారతీలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కతో పాటు మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరవుతారని తెలిపారు. లంబాడీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అధికారుల తప్పిదంతో 'అండర్‌పాస్' ఇబ్బందులు

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కొత్తూర్ అండర్‌పాస్‌ను పరిశీలించి, ఇన్‌స్పెక్టర్‌కు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, జూన్ 23: అధికారుల తప్పిదంతోనే అండర్‌పాస్ వద్ద ఇబ్బందులు తలెత్తుతున్నాయని, కోట్లాది రుపాయలు వెచ్చించి కొత్తూర్ సమీపంలో ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో నిర్మించిన అండర్‌పాస్ రహదారి ప్రజలకు నిరుపయోగంగా ఉంటూ, వాహనచోదకులకు ఇబ్బందులు తెచ్చిపెడుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రానికి సమీపంలో గల అండర్‌పాస్ రహదారిని ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించారు. అండర్‌పాస్ వద్ద వర్షపునీరు నిలవకుండా ఇటీవల ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు మరమ్మతులు నిర్వహించి, సర్వీసు రోడ్డును ప్రారంభించడంతో వాహనాల రాకపోకలు ప్రారంభమైనాయి. దాంతో స్థానిక పోలీసులు వైజంక్షన్, పెంజర్ల జంక్షన్ వద్ద రాకపోకలను బంద్ చేశారు. ఇటీవల వర్షాలు పడడంతో అండర్‌పాస్ వద్ద తిరిగి వర్షం నీరు వచ్చి చేరడంతో వాహనచోదకులకు తిరిగి ఇబ్బందులు ప్రారంభమైనాయి. ఇట్టి విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకపోవడంతో, ఎమ్మెల్యే స్పందించి అండర్‌పాసన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేక రులతో మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల తప్పిందంవల్ల అండర్‌పాస్‌ను సరైన డిజన్‌తో నిర్మించలేదన్నారు. సాంకేతిక లోపంతో వర్షపునీరు అండర్‌పాస్ వద్ద నిలిచిపోతున్నాయని ఆయన అన్నారు. దాంతో అండర్‌పాస్ రహదారి వాహనచోదకులకు ప్రాణ సంకటంగా మారిందని వాపోయారు. కోట్లాది రుపాయలు వెచ్చించి నిర్మించిన అండర్‌పాస్ ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి వైజంక్షన్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ఎమ్మెల్యే శంకర్ కోరారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జి.హరినాథ్‌రెడ్డి, నాయకులు జె.సుదర్శన్‌గౌడ్, వీరమోని దేవేందర్ ముదిరాజ్, శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బారికేడ్లను తొలగిస్తున్నాం : ఇన్‌స్పెక్టర్

మండల కేంద్రానికి సమీపంలో వైజంక్షన్, పెంజర్ల జంక్షన్‌ల వద్ద రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు. అండర్‌పాస్ రహదారి వద్ద వర్షపునీరు నిలుస్తుండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని జంక్షన్‌ల వద్ద బారికేడ్లను తొలగిస్తున్నామని పేర్కొన్నారు

అభివృద్ధిలో కల్వకుర్తిని ఆదర్శంగా నిలుపుతా

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూన్ 23: అభివృద్ధిలో కల్వకుర్తి నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలిపేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల నాయకులతో ఆదివారం ఎమ్మెల్యే సమావేశమయ్యారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలు, అసంపూర్తి పనులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి ప్రజాప్రతినిధులు, నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఇర్విన్ గ్రామంలో అభివృద్ధి పనులకు నిధుల మంజూరుపై స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో గత ప్రభుత్వంలో చేపట్టిన అసంపూర్తిగా నిలిచిపోయిన అభివృద్ధి పనులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి వినియోగంలోకి తెస్తామని చెప్పారు. కేఎల్‌ఐ -82 కాల్వ అసంపూర్తి పనులు ప్రారంభించడం జరిగిందని, నెలరోజుల్లో పూర్తిచేసి ఆమనగల్లు, మాడ్గుల మండలాల పరిధిలో 35వేల ఎకరాలకు సాగునీరందించడం జరుగుతుందన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల అసంపూర్తి పనులు పూర్తిచేసి త్వరలో వినియోగంలోకి తెస్తామని చెప్పారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ, శంకర్, భాస్కర్‌రెడ్డి, హన్మనాయక్, రమేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సోనియా, రేవంత్ చిత్రపటాలకు పాలాభిషేకం

● రైతు రుణమాఫీపై ఆమోదంతో హర్షం

ఇబ్రహీంపట్నం, జూన్ 23: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రైతుల రుణమాఫీపై రేవంత్‌రెడ్డి అధక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలపడంపై ఆదివారం ఇబ్రహీంపట్నం చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు రైతులతో కలిసి ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీ, సీఎం రేంవత్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు భూపతిగల్ల మహిపాల్ మాట్లాడుతూ రైతు కుటుంబం నుంచి వచ్చిన రేవంత్‌రెడ్డికి రైతుల కష్టాలు తెలుసుగనుక రైతులకిచ్చిన మాట ప్రకారం ఒకే విడతలో రుణమాఫీ చేయడానికి విధివిధానాలను రూపొందిస్తున్నట్లు ప్రకటించడంపై రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన సవాల్ మేరకు తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎ-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదుల్ల పాండురంగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జడల రవీందర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు ఆకుల ఆనంద్, నాయకులు గురునాథరెడ్డి, చింతం బాల్‌రాజ్ యాదవ్, రాచర్ల వెంకటేశ్వర్లు, కె.అమృతాసాగర్, కోడూరి రమేష్, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో సోనియా, రేంవత్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గిరిజన హక్కుల పరిరక్షణకు కృషి



హుస్సేన్ నాయక్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు

ఆమనగల్లు/కడ్తాల్, జూన్ 23: గిరిజనుల హక్కుల పరిరక్షణకు జాతీయ ఎస్టీ కమిషన్ ద్వారా కృషి చేస్తున్నట్లు కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ తెలిపారు. ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం గిరిజన వర్గాల అభ్యున్నతి, అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోల్లాపూర్ మండలం మొలచింతలపల్లికి చెందిన చెంచు మహిళలపై కౌలుదారుల దాడి నేపథ్యంలో ఆమెను పరామర్శించడానికి వెళ్తున్న హుస్సేన్ నాయక్ కొద్దిసేపు ఆమనగల్లు పట్టణంలో ఆగారు. జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యుడిగా నియమితులై తొలిసారిగా ఆమనగల్లుకు వచ్చిన ఆయనకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. స్థానిక బస్టాండ్ వద్ద ఆయనను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. పలువురు స్థానిక గిరిజనులు బట్టర్‌పై వెంచర్ నిర్వాహకులు తమ భూములను ఆక్రమించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయనకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంనతరం బీజేపీ నాయకుడు పోతుగంటి భరత్ ప్రసాద్ , బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్‌లతో కలిసి హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్‌చైర్మన్ దుర్గయ్య, బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, నియోజకవర్గ కో-కన్వీనర్ నర్సింహ, కౌన్సిలర్లు లక్ష్మణ్, చెన్నకేశవులు, విక్రమ్‌రెడ్డి, కృష్ణనాయక్, శ్రీధర్, నాయకులున్నారు. కాగా, హుస్సేన్ నాయక్ కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ ఆలయాన్ని సందర్శించారు. మైసమ్మ దేవతకు పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, బీజేపీ నాయకులు హుస్సేన్‌కు ఘన స్వాగతం పలికారు.

అధైర్య పడొద్దు అండగా ఉంటా : సుంకిరెడ్డి



ఆర్థికసాయం చేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, జూన్ 23: ప్రకృతి వైపరీత్యాల మూలంగా నష్టపోయిన రైతులు అధైర్య పడొద్దని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మండలంలో ఆదివారం సుంకిరెడ్డి విస్తృతంగా పర్యటించారు. విఠాయిపల్లిలోని ఆంజనేయ స్వామి దేవాలయాన్ని డీసీసీ ఉపాధ్యక్షుడు సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డితో కలిసి సందర్శించి పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి రూ.2లక్షల ఆర్థిక సాయం అందించిన సుంకిరెడ్డిని నిర్వాహకులు సత్కరించారు. గౌరారంలో పిడుగుపాటుకు రెండు పాడి ఆవులు కోల్పోయిన నిట్ట పర్వతాలును పరామర్శించి రూ.25వేల ఆర్థికసాయం చేశారు. నాయకులు రచ్చ శ్రీరాములు, రాజశేఖర్, శ్రీనివాస్ రెడ్డి, అష్రఫ్, సాజిద్, రామస్వామి, రమేశ్, కిరణ్‌కుమార్, వెంకటయ్య, వినోద్, రాఘవేందర్, మల్లేశ్ నాయక్, అభినవ్‌రెడ్డి, కొండల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

తలకొండపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రకటించిన విధంగా అర్హులైన నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి వారి సొంతింటి కళను సాకారం చేయాలని జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ కోరారు. మండల కేంద్రానికి అశ్వ బాల్‌రాజ్ ఇంటి నిర్మాణానికి తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. ఆర్థిక ఇబ్బందులతో బాల్‌రాజ్ ఇంటి నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. వెంకటేశ్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మెటీరియల్ సమకూర్చగా ట్రస్ట్ సభ్యులు, స్థానిక నాయకులు బాల్‌రాజ్‌కు అందజేశారు. మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్, కో-ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, నాయకులు పాల్గొన్నారు.

తలకొండపల్లి : వెల్జాల్‌కు చెందిన పోషమోని రాములమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. మృత దేహాన్ని బీఆర్‌ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ సందర్శించి నివాళులర్పించారు. మృతురాలు కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.3వేలు సమకూర్చగా స్థానిక నాయకులు అందజేశారు.

ఆమనగల్లు : తెలంగాణ రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి మోసం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెరతీసిందని ఎంపీటీసీల సంఘం మండలాధ్యక్షుడు కుమార్ అన్నారు. రైతులకు రూ.2లక్షల లోపు రుణాలు మంజూరు చేయకముందే ఆ పార్టీ నాయకులు సంబురాలు చేయడమేమిటని ప్రశ్నించారు. పట్టణంలో విలేకరులతో ఆయన మాట్లాడారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

షాబాద్, జూన్ 23 : మండల కేంద్రంలోని షాబాద్ జిల్లా పరిషత్ పాఠశాలలో 1994-95 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం షాబాద్‌లోని ఓ గార్డెన్‌లో 29 సంవత్సరాల తరువాత 130 మంది పూర్వ విద్యార్థులు కలుసుకొని తీపి జ్ఞాపకాలు పంచుకున్నారు. చిన్నతనంలో ఏర్పడిన స్నేహబంధం ఎప్పటికీ మరిచిపోనిదని, విడదీయరానిదని గుర్తుచేసుకున్నారు. వ్యాపార, ఉద్యోగ, కుటుంబాలరిత్యా ఎక్కడెక్కడో స్థిరపడినవారు ఒక్క చోటికి రావడం ఆనందానికి అవధులు లేకుండా పోయింది. పూర్వ విద్యార్థులు సందడిగా గడిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు వీరస్వామి, యాదగిరి, లింగం, దశరథ, శ్రీనివాస్, కుమార్, ప్రసాద్‌రావు, శ్రీదేవి, పూర్వ విద్యార్థులు రవీందర్‌గౌడ్, చంద్రయ్య, హరికుమార్, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, నీరజ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు